# రోగం కుదిరింది

-గుమ్మా ప్రసాదరావు

రాజేష్‌బాబు! ‘మీ వదినమ్మగారు చెప్పిన మాట వినరెందుకు? మీకంటె పెద్దవారు. అన్నీ ఆలోచించే మీకా సలహా ఇచ్చారామె. మీది మరీ మొండితనం’ అన్నాడు నౌకరు శంకరం గది ఊడుస్తూ.

రాజేష్‌కు కోపం పచ్చింది.. ఇంటి నౌకరు కూడా తనకు హితబోధ చేసే వాడయ్యాడా?

“బాబు! పది రోజులై చూస్తున్నాను. ఒక్కడంటే ఒక్కడు వచ్చాడా మీ దుకాణానికి? దోమలు తోలు కుంటూ ఇలా ఎన్నాళ్ళు కూర్చుంటారు?”.

“దుకాణమా?! శంకరం, నువ్వేమంటున్నావు? నేను కందిపప్పు ఉప్పు అమ్మే కిరాణా దుకాణం తెరిచేనా? లేక సబ్బులు పేస్టులు అమ్మే జనరల్ షాపా? నేనెవర్ని? డాక్టర్ రాజేష్‌కుమార్ ఎంబిబిఎస్. ఇది దుకాణం కాదు, క్లినిక్.

“ఏదైతేనేం? వ్యాపారమేగా మీరు చేయాలనుకుం టున్నది. ఇంతకంటె కిరాణా దుకాణం తెరిచినా ఇరుగుపొరుగు వారు పప్పుకో ఉప్పుకో వచ్చే వారు. మీ వదినమ్మగారు ఏం తప్పుమాట చెప్పారు? ఉద్యోగం చేస్తే నెలతిరిగేసరికి తొమ్మిది వేలు జీతం దొరుకు తుందట”.

రాజేష్ సమాధానంగా ఏమి చెప్పేవాడో కాని శంకరం తన పని అయిపోవడంతో వెళ్ళిపోయాడు.

తను బోర్డు పెట్టి ప్రాక్టీసు చేస్తున్న సంగతి నలు గురికీ తెలియాలిగా? కొంచెం టైము తీసుకుంటుంది అని తనలో తనే అనుకున్నాడు రాజేష్.

లేచి వెళ్లి బయట గోడకు బిగించిన బోర్డు చూశాడు. పాతిక రూపాయలు ఎక్కువ తీసుకున్నా పెయింటర్ చాలాబాగా రాసేడు. కలర్ కాంబినేషన్ ఆకర్షణీయంగా ఉంది. దారినపోయే వాళ్ళు క్షణం సేపు చూసి చదివికాని ముందుకి వెళ్ళలేరు.

ఇంటర్ పూర్తి కాగానే రాజేష్ అన్నయ్యతో తన మనసులోని మాట అన్నాడు.

“అలాగే చేద్దాం, ముందు మీ వదిన అభిప్రాయం తెలుసుకో” అన్నాడతను.

వదిన తన అభిప్రాయంతో ఏకీభవించదని రాజే ష్‌కు తెలుసు. పొరుగింటి శాంతతో వారం పదిరోజుల క్రితం వదిన అన్నమాటలు అతను విన్నాడు.

“మా మరిది ఇంటర్ పూర్తి అయిపోయింది. అత డికి ఉద్యోగం వస్తే అతడి చదువుకోసం చేసిన అప్పులు తాపీగా తీర్చవచ్చు” అని అందామె.

ఇంత సాము నేర్చుకున్నది మూలనున్న ముసల మ్మను కొట్టడానికా? ఉద్యోగంలో ఏముంది? ఏమూల పల్లెలోనో పోస్టింగు ఇస్తారు. అక్కడ హెల్త్ సెంటర్ పశువుల పాక లాగుంటుంది. పట్నంలో పెరిగిన తను అక్కడేం వుండగలడు? ప్రయివేట్ క్లినిక్ అయితే బోలె డంత ఆదాయం.

రాజేష్‌కు ఆ ఇంటి ఆర్థిక స్థితిగతులు తెలియనివి కావు. తన చదువుకని వదిన తన వంటి మీద బంగా రం కరిగించింది. అసలు అన్నయ్య డాక్టరు చదువంటే ఇష్టపడ లేదు. నాలుగైదు లక్షలు లేనిదే చదువు పూర్తి కాదు. కాని వదిన పట్టు పట్టింది. ఎన్నో అప్పులు చేశారు. అన్నయ్య పిల్లలిద్దరూ ఇప్పుడు హైస్కూలు చదువుల కొచ్చారు. వాళ్ళ ఫీజులు పుస్తకాలు డ్రెస్సులు, క్లినిక్ తెరవడంలోని సాధకబాధకాలు రాజేష్‌కు తెలుసు. కనీసం నలభై ఏభై వేలు పెట్టుబడి కావాలి.

“ఏమిటి రాజేష్, మీ అన్నయ్య చెవిలో ఏదో అంటున్నావు. నేను వినకూడదా? అంది కుసుమలత.

“చదువు పూర్తి అయింది. వాడు ఉద్యోగంలో చేర తాడు, డబ్బు వత్తిడి వుండదు. అప్పులు తెగిపోతాయి అని మనం అనుకుంటున్నామా? వాడు ఉద్యోగం చెయ్యను అంటున్నాడు” అన్నాడు కొండలరావు భార్యతో.

“బాగుంది, ఉద్యోగం చెయ్యక ఇంట్లో గోళ్ళు గిల్లు కుంటూ కూర్చుంటావా? ఆ మాత్రం దానికి ఈ ఎంబి బిఎస్ ఎందుకు చేశావు?” సూటిగా అడిగింది కుసుమ లత మరిదిని.

“నేను చెప్పింది అదికాదు వదినా! ఉద్యోగం చేయాలన్న కోరిక నాకు లేదు. స్వంత ప్రాక్టీసు చెయ్యా లనుకుంటున్నాను. ఉద్యోగం చేస్తే జీతమెంత వస్తుంది? పైగా ఏ మారుమూల గ్రామానికో వేస్తారు” అన్నాడు రాజేష్.

“రాజేష్ నీకు మన ఇంటి పరిస్థితులు తెలియవా? క్లినిక్ తెరవడం మాటలా? దానికెంత మదుపు కావాలి. అయినా కుర్ర డాక్టరువి నీ దగ్గర కెవరొస్తారు? ఈ

రోజుల్లో వీధికి నలుగురు డాక్టర్లున్నారు" అంది కుసుమలత.

"నేను చెప్పింది అర్థం చేసుకోబాబు. కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తే అనుభవం వస్తుంది. పైగా అంత పెట్టుబడి ఎక్కడ నుంచి తెస్తాము?" అంది కుసుమలత.

వదినకెలా నచ్చ చెప్పడం?

ooo

కుసుమలత ఆ ఇంటి కోడలుగా అడుగు పెట్టిన నాడు రాజేష్ ఏడవ తరగతిలో వున్నాడు. అప్పటికే ఆమె అత్తగారు చనిపోయారు. కుసుమలత మరిదిని కన్న కొడుకులా సాకింది.

వదినను ఎలా ఒప్పించడం. ఆమెకు ఇష్టం లేని పని తన అన్న చెయ్యడు.

"వదినా నేను చెప్పేది అర్థం చేసుకో. క్లినిక్ అయితే ఆదాయం అధికంగా వుంటుంది. ఉద్యోగం చేయాలన్న కోరిక నాకు లేదు. అప్పులన్నీ తీర్చే బాధ్యత నాది"

"బాబూ! నువ్వూ అర్థం చేసుకో. డిస్పెన్సరీ తెరవాలంటే ముందుగా ఒక మంచి వసతి కావాలి. అద్దెలు ఆకాశాని కంటుతున్నాయి. నీ పరికరాలు, ఉపకరణాలు కొనాలంటే చాలా డబ్బు కావాలి. మన దగ్గర అంత డబ్బేది? ఇప్పటికే తలమునక అప్పులున్నాయి. పైగా నీకున్న అనుభవం ఏపాటి?"

"వదినా! కొంతకాలం మందకొడిగా నడిచినా రానురాను వృద్ధి పొందుతుంది. ఏ డాక్టరుకైనా ముందు సమస్యలుంటాయి".

కుసుమలత మరిదికి నచ్చ చెప్పలేక పోయింది. కాని మరింత భారం మోసే శక్తి తన భర్తకు లేదు.

రాజేష్ ఆ రాత్రి అలిగి భోజనం మానేశాడు. కుసుమలతకు అది కొత్త కాదు. అలిగి భోజనం మానేస్తే ఆమె బాధ పడుతుంది. బ్రతిమాలుతుంది.

"రాజేష్! నువ్వు భోజనం మానేసి సాధించాలనుకుంటున్నావా?"

"అదేం కాదు. నిజంగా నాకాకలి లేదు" అన్నాడు ముఖం మరో పక్కకు తిప్పుకుని.

"ముందు భోజనం చెయ్యి. ఆ తరువాత ఆలోచించుదాం" అంది ఆమె.

అది తన తొలి విజయంగా భావించేడు రాజేష్

ooo

"నిండా మునిగిన వాడికి చలేమిటి? వాడిష్టాన్ని ఎందుకు కాదనాలి. మరో పాతిక వేలు ఖర్చు" అంది కుసుమలత భర్తతో.

కొండలరావు నవ్వేడు "వాడు నీకు మరిదికాడు. పెద్దకొడుకు. వాడిష్టానికి నీవు వ్యతిరేకంగా నడుచుకోలేవని నాకు తెలుసు".

"వేరే ఇల్లు తీసుకోవడం కుదరదు. మనముందు గది క్లినిక్‌గా వాడుకోమందాం. ఏమంటారు?" అంది.

ఆ ఇల్లే చిన్నది. ముందు గది డ్రాయింగ్ రూమ్‌గా వాడుకుంటున్నారు. పిల్లలు అందులోనే చదువుకుంటారు. పడుకుంటారు. ఆ గది లేకపోతే ఇబ్బందే. పైగా రాకపోకలు పెరటి గుమ్మంలోంచి.

"ఏమిటి మన ఇల్లు పెద్ద భవంతా? ఆ ముందు గది లేకపోతే మన రాకపోకలకు ఇబ్బంది కదా? ఆలోచించే ఆ మాట అన్నావా?" అన్నాడు కొండలరావు.

మరిది కోరిక తీర్చడం కుసుమలత అభీష్టం. ఏమో తన మరిది ప్రాక్టీస్ మూడు పువ్వులు ఆరు కాయలు కాదా? అనే ఆశాభావం.

ooo

అప్పటికి పది రోజులైంది ఆ క్లినిక్ తెరిచి. ఒక్కడంటే ఒక్కడు రాలేదు. కొంచెం దూరంలో ఉన్న డాక్టరు యోగేష్ క్లినిక్‌లో పేషెంట్లు బార్లు తీర్చి కూర్చుంటున్నారు గంటల తరబడి. వాళ్ళలో కొందరు వచ్చినా

## ఐదు హైకూలు

వీడ్కోలు చెబితే
మనసు దూదిపింజం..
ఆధునిక అల్లుడు!

మండుటెండలో
మలయ మారుతం...
చిన్నారి చిరునవ్వు!

తప్పటడుగుల వేళ
చేయూతతో సరిదిద్దు...
తప్పటడుగులకు సరిహద్దు!

వ్యయం ఓపికతో అదుపు...
ఒకరకమైన పొదుపు...
సద్వినియోగానికి మదుపు!

రాత్రి పది గంటలకు
కోడిపుంజుగారి కూత...
కాల్‌సెంటరీయులకు మేల్కొలుపు!

-గుండాన జోగారావు

బాగుండునుగా? తను వైద్యం చేయలేదని వారి భయమా?

ఆదాయం పూజ్యం. రాజేష్‌లో నిరుత్సాహం గూడు కట్టుకుంటున్నది.

"అయ్యో! అంత భాగ్యం కూడానా? నేను చూడలేదు కాని మా మరిది ఈగలు తోలుకుంటూ కూర్చుంటు న్నాడని మా శంకరం చెప్తున్నాడు. వదినా, ఇవాళ నా సంపాదన ఈ పది రూపాయలు అంటూ నా చేతిలో పెట్టలేదు. ఆ ముందు గదిలేక మేం పడుతున్న అవస్థలు వేరు" అంటోంది కుసుమలత, పొరుగింటి శాంత అడిగిన దానికి సమాధానంగా.

ఇంటిగుట్టు రచ్చకీడుస్తారా ఎవరైనా? వదిన కావాలనే అలా చెప్తోంది. ఆవిడ ఆ ప్రస్తావన అసలు తేలేదు.

అప్పుడు ఆ శాంతగారు అన్నమాటలు రాజేష్‌కు శూలాల్లా గుచ్చుకున్నాయి.

"పోనీలే వదినా! రోగులు రాక పోతేనేం. ఈ వాడలో చాలామంది ఉద్యోగస్తులు వున్నారు. సెలవులు కావాలంటే డాక్టరు సర్టిఫికెట్లు కావాలిగా? అలాంటి వారు మీ మరిదినే ఆశ్రయిస్తారు. పదో పాతికో దొరక్కపోవు" అంది శాంత.

"ఏమిటి తను క్లినిక్ తెరిచింది దొంగ సర్టిఫికేట్లు ఇవ్వడానికా?" మనసులోనే బాధ పడ్డాడు.

మనిషి ఆశాజీవి.

రాజేష్‌కు తన సామర్థ్యం మీద నమ్మకం ఉంది. రోగులు రాకపోతారా అని పడిగాపులు పడేవాడు. తనకు తెలిసిన వారికి క్లినిక్ తెరిచానని, ఇతర డాకర్ల కన్నా కన్సల్టేషన్ ఫీజు చాలా తక్కువ తీసుకుంటానని చెప్పేవాడు.

"శంకరం, మీ వాడలోని వారు జబ్బు చేస్తే ఎక్కడకు వెళ్తారు? నా దగ్గరకు రమ్మనమను" అని శంకరంతో అన్నాడు.

"డాక్టరు బాబు! మా వాడలోని వారు జబ్బు చేస్తే ఏ డాక్టరు దగ్గరకు పోరు. అంతంత డబ్బు పోసి వైద్యం చేయించుకునే స్థోమత వారికి లేదు. అంతగా అవసరమొస్తే ధర్మాసుపత్రికి వెళ్తారు" అన్నాడు వాడు.

"శంకరం! నాలుగు రోజులై తెగదగ్గుతున్నావు. నాకు చెప్తే పరీక్ష చేసి మందులు రాయనా?"

"బాబూ! నేను మీ నౌకరునని అభిమానంతో నా దగ్గర ఫీజు తీసుకోరు. కాని ఆ మందుల కొట్టువాడు ఊరికేనే మందులివ్వడుగా? మందులు కొనలేని వాడిని మరి పరీక్షలెందుకు? ఎలా వచ్చిందో అలాగే పోతుంది".

ఆ రోజు రాత్రి డాక్టరు రాజేష్‌కు మరింత బాధ కలిగింది.

"వదినా! ఊర్మిళకు ఆ కట్టేమిటి?" అన్నాడు తనతోపాటు భోజనానికి కూర్చున్న అన్న కూతురు కాలుకి కట్టు చూసి.

"దెబ్బతగిలితే వేరే డాక్టరు దగ్గరకు పంపాలా? నేను లేనా?" అన్నాడు కోపంగా.

"అయ్యో అది ఎప్పుడు దెబ్బతగుల్చుకుందో, కట్టుకట్టించుకుందో నాకు తెలియదు. స్కూలు నుంచి వస్తూ వుంటే సైకిలు గుచ్చేసిందట. అప్పుడు డాక్టరు యోగేష్ కూతురు కూడా వుందట. అదే దీన్ని రిక్షాలో ఎక్కించి వాళ్ళ నాన్న దగ్గరకు తీసుకు వెళ్ళింది. ఇద్దరూ స్నేహితులు కదా? అతను బేండేజ్ చేసి మాత్రలిచ్చాడు. అతడు మన దగ్గర ఫీజు తీసుకోడని నీకు తెలుసుకదా?" అంది కుసుమలత.

"బాబాయ్! పెరటి చెట్టు మందుకు పనికి రాదంటారు" అంది నవ్వుతూ ఊర్మిళ.

తను ఆ చిన్న పిల్లకూ లోకువయ్యాడా!

తన దగ్గరకు ఏ రోగి వచ్చినా కొత్తవాడే అవుతాడు. వారికి తన ఘనత తెలియాలి. అందుకోసం చాలా ప్రణాళికలు రూపొందించాడు డాక్టరు రాజేష్.

"శంకరం! ఎవరో వస్తున్నారు. తప్పకుండా అం దులో ఒకడు జబ్బు మనిషి అయి వుంటాడు. నేను వాళ్ళకోసం కాచుక్కూర్చున్నట్లు వుంటే బాగుండదు. జర్నల్ చదువుతూ కూర్చుంటాను. వాళ్ళను బెంచీ మీద కూర్చోపెట్టి విషయం నాకు చెప్పు" అన్నాడు.

## ఆకాశం అంచుల్లోంచి..!

హాలికుల ఆత్మహత్యలతో
ఏర్పడ్డ శవాల గుట్టలపై
విలపిస్తున్న పసిపాపల
చిట్టిచేతుల ఆర్తనాదాలు
పసిగట్టిందేమో నింగి
ఆకాశం అంచుల్లోంచి
అశ్రుబిందువులు రాలుతున్నాయి
మేము సైతం చేయూతకిక
సిద్ధమంటూ పారుతున్నాయి.

–భారతీయుడు

"అలాగే డాక్టరు బాబు, వాళ్ళు మన దగ్గరికే వస్తున్నారో పక్క వీధిలోని సినిమాకు వెళ్తున్నారో" అన్నాడు వాడు.

శంకరం అన్నదే నిజమైంది.

రోడ్ల మీద ఇన్ని ఏక్సిడెంట్లు జరుగుతున్నాయి.

> ## ఇంకా... ఉంది!
>
> ఏ దృశ్యాన్ని చూసినా
> అదృశ్యమైన దృశ్యం... ఇంకా
> మిగిలే వుంది.
> ప్రతిరోజు ప్రపంచాన్ని చూస్తున్నా
> చూడాల్సిన ప్రపంచం.... ఇంకా
> మిగిలే వుంది.
> జీవిత సారాంశమెంత చెప్పిన
> చెప్పాల్సింది... ఇంకా
> మిగిలే వుంది.
> చరిత్రనెంతగా తిరగవ్రాసినా
> రాయాల్సిన చరిత్ర... ఇంకా
> మిగిలే వుంది.
> అంతర రంగమెంతగా తరచి చూసినా
> చూడాల్సిన ఆంతరంగం... ఇంకా
> మిగిలే వుంది.
> ఘటనా ఘటన సంఘటనలనెంత వర్ణించినా
> వర్ణించాల్సింది... ఇంకా
> మిగిలే వుంది.
>
> ఇంద్రధనస్సులో రంగులన్ని చూసినా
> చూడని రంగేదో... ఇంకా / మిగిలే వుంది.
> ఆత్మీయానుబంధాల స్పర్శలెన్ని పొందినా
> పొందని స్పర్శ ఏదో... ఇంకా / మిగిలే వుంది.
> అంతా తెలిసిందనుకున్నా
> తెలుసుకోవలసింది... ఇంకా
> మిగిలే వుంది.
> ఒక దాని వెనుక
> ఒకటి... దాని వెనుక మరొకటి
> అనుభవాలెన్ని చవిచూసినా
> అనుభవానికి రానిదేదో... ఇంకా
> మిగిలే వుంది.
> శత వసంతాలు జీవించినా
> జీవించాల్సింది... ఇంకా
> మిగిలే వుంది.
>
> -ఎస్.ఎం.సుభాని

తమ వీధికూడా చాలా రద్దీ అయినదే. ఒక్క ఏక్సిడెంటు తన క్లినిక్ ముందు జరిగితే ఎంత బావుండును అని రాజేష్‌కి అనిపించేది.

మరో వారం రోజులు గడిచాయి.

"బాబు! మీ అన్నయ్య గారు ఎంత చెప్పినా మీరు వినలేదు. మీ దగ్గర చుట్టాలింటి పెళ్ళికి వెళ్ళలేదు. మీ వదిన ఎంత నొచ్చుకొందని" అన్నాడు శంకరం.

"శంకరం! ఇది మరీ బాగుంది. నేను డాక్టర్ని. ఎప్పుడు రోగికి నా అవసరం వస్తుందో. తలుపులు వేసి తాళం బిగించి వెళ్ళిపోతే వాళ్ళు ఏమనుకుంటారు? రెండో మారు వస్తారా?"

శంకరం ఏడవ లేక నవ్వుకున్నాడు. పదిహేను రోజులలై రాని వాళ్ళు ఈ రెండు రోజులలోనే వచ్చేస్తారా?

రాజేష్ పరిస్థితికి వాడికి జాలివేసింది. 'భగవంతుడా! ఒకరిద్దరు పేషెంట్లను మా డాక్టరు బాబు దగ్గరకు పంపించవా?' అనుకున్నాడు మనసులో.

శంకరానికి మరో చిట్కా చెప్పాడు.

'ఎవరైనా ఖరీదైన పేషెంటు మనం గుమ్మం ఎక్కాడనుకో, నేను పెరటి త్రోవన జారుకుంటాను. వచ్చిన వాళ్ళను కూర్చో పెట్టు. ఇంతవరకు నేను తెగ బిజీగా వున్నానని చెప్పు. ఇప్పుడే లాయర్ గురుమూర్తి గారింటికి వెళ్ళానని చెప్పు. పది నిమిషాల్లో వస్తున్నానని, కూర్చోమని చెప్పు. నా ప్రాక్టీసు ఎంత బాగా నడుస్తున్నదో చెప్పి వాళ్ళను ఆకట్టుకో' అంటూ బోధపరిచేడు.

"తమరంతగా చెప్పాలా? చూసిరమ్మంటే కాల్చి వచ్చేరకం నేను" అన్నాడు శంకరం.

నిజంగా ఆ రోజు డాక్టరు రాజేష్ పంట పండింది.

పైజమా కుర్తా వేసుకొని కళ్ళకు గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు, కాళ్ళకు షోలాపూర్ చెప్పులు వేసుకున్న నడి వయసు మనిషి సైన్‌బోర్డులు పరిశీలిస్తూ రాజేష్ క్లినిక్ ముందు బోర్డు చూసి ఒక్క నిమిషం ఆగేడు. మనిషి సామాన్యంగా కనిపిస్తున్నా లోన ఏం జబ్బులున్నాయో? రాజేష్‌కు మంచి బోణీ దొరుకుతుందన్న సంతోషం కలిగింది.

"శంకరం! నేను చెప్పింది గుర్తుందా? నేను పెరటి త్రోవన వెళ్ళి పది నిమిషాల్లో స్కూటరు మీద వస్తాను."

శంకరం గుమ్మం వరకు వెళ్ళి "రండి, రండి అక్కడే నిలబడి పోయారేం?" అన్నాడు.

"రాక తప్పుతుందా" అంటూ అతను మెట్లెక్కి లోపలికి వచ్చాడు. రాజేష్ అవస్థ చూస్తున్న శంకరం ఇక తను రంగంలోకి దిగాలనుకున్నాడు.

"డాక్టరుగారి కోసం వచ్చారా? ఔనులెండి మరెందుకు వస్తారు? పది నిమిషాల వరకు వారిక్కడే వున్నారు. అవతల లాయరు గురుమూర్తి ఇంటికి అర్జంటుగా వెళ్లవలసి వున్నా ఏదీ ఇక్కడ ఖాళీ లేదే. వారికి క్షణం తీరిక లేకపోయింది. రోజూ కన్నా రెట్టింపు పేషెంట్లు వచ్చారు".

"అంటే డాక్టరు గారు లేరా?"

"అయ్యో! మీరు నిరాశపడకండి. లాయరుగారిని పరీక్షించి మందులు రాసి పదిహేను నిముషాల్లో వస్తానని చెప్పి వెళ్లారు. నేను గొప్పలు చెప్పడం లేదు. వారి హస్తవాసి అలాంటిది ఆ నోట ఈ నోటా విని రోగులు కట్ట కట్టుకు వస్తున్నారు. ఈ వీధిలోని డాక్టర్ల ప్రాక్టీసులు మందగిల్లాయి.

"నేనెంత సేపు కూర్చోవాలి?"

"మామూలుగా అయినా రోగులు ఎక్కువ మంది ఉంటే కనీసం అరగంట కూర్చోవాలి. మీకా బాధ లేదు. ఇక్కడ పేషెంట్లందరూ వెళ్ళిపోయారు. డాక్టరు గారు వస్తూనే మిమ్మల్ని చూస్తారు. ఐదు నిమిషాలు ఓపిక పట్టండి" అన్నాడు శంకరం.

"అలాగా! డాక్టరు గారి ప్రాక్టీసు బాగుందంటావు?"

"నేను అనడమేమిటండీ! ఒక పావుగంట ముందు మీరు వచ్చి వుంటే మీ కళ్ళతో మీరే చూసేవారు. ఎప్పుడో అతను ఎంబిబిస్‌లో చేరినప్పుడు కొన్న స్కూటరు. ఆ స్కూటరు విజిట్స్‌కి బాగోలేదు కారు కొనాలోయ్ అంటున్నారు డాక్టరుగారు. ఏ కారు అన్నది సమస్య. వాళ్ళ వదిన గారు ఏసి కారు కొను అంటారు. ఇతనేమో ప్రస్తుతానికి మామూలుది కొంటాను. మరో ఆరు నెలల తర్వాత ఏసి కొంటాను అంటారు. ఏది ఏమైనా ఈ వారంలో కారు రావటం ఖాయం" అన్నాడు శంకరం.

"అంటే నేను మరో పది నిమిషాలు వెయిట్ చెయ్యాలంటావు?"

"అక్కరలేదు సార్! అదిగో డాక్టరు బాబుగారు వచ్చేశారు. పేషెంట్లను ఇబ్బంది పెట్టడం అతనికి బొత్తిగా ఇష్టం లేదు".

"శంకరం, అతనొచ్చి ఎంత సేపైంది?" అడిగాడు డాక్టర్ రాజేష్

"ఏదీ ఇప్పుడే వస్తున్నారు. మీరు ఇంతలోనే వచ్చారు".

"ఇంతకీ ఏం జబ్బు? ఇంతకు ముందు మరే డాక్టర్ని అయినా చూశారా?"

"డాక్టరుగారు, నా పేరు వైకంఠం"

"చెప్పండి వైకుంఠం గారు, ముందు ఆ బల్ల ఎక్కి పడుకోండి"

"డాక్డరు గారు, నే చెప్పేది వింటారా?"

"డాక్టరన్నవాడు పేషెంటు చెప్పింది తప్పక వినాలి. అది మెడికోస్‌కు చెప్పిన మొదటి పాఠం".

"అయ్యా! నేను రోగిని కాను. నాకే రోగము లేదు"

"మరెందుకు వచ్చారు?"

"నేనొక సంఘ సేవకుడ్ని. ప్రజల కోసం పాటు పడుతున్నది మా సంస్థ. మీ లాంటి గొప్పవారి దగ్గర విరాళాలు సేకరించి ఆ డబ్బును ప్రజల ఉపయోగం కోసం ఖర్చు చేస్తాం. అంటే మాది ఎన్.జి.ఓ. సంస్థ. గుళ్లూ గోపురాలు కట్టిస్తాం. వరద బాధితులకు సహాయం చేస్తాం. భూకంప పీడితుల్ని ఆదుకుంటాం. పేదవారికి అన్నదానాలు, కంబళ్ళు పంచుతాం. ఈ ఊరిలోని డాక్టర్లందరి దగ్గరా చందాలు వసూలు చేస్తున్నాను. డాక్డరు యోగేష్‌గారు వెయ్యి నూట పదహారులు ఇచ్చారు. మీ చందా ఎంత రాయమంటారు? మీ ప్రాక్టీసు దివ్యంగా వుందని ఈ శంకరం అంటున్నాడు. మీరు పిసినారులు కారుగా, వెయ్యినూట పదహార్లు రాయనా? లేక ఇంకా ఎక్కువ రాయనా?"

డాక్డరు రాజేష్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది.

"అబ్బే డాక్టరు యోగేష్ గారికీ నాకు సాటీయా? నేను ప్రాక్టీసు మొదలెట్టి ఇంకా నెల రోజులు కాలేదు. మిమ్మల్ని ఒట్టి చేతుల్తో పంపలేను. ఒక వంద రాయండి" అన్నాడు డాక్డర్ రాజేష్.

"వంద రూపాయాలా? అది మీకే కాదు మాకూ చిన్నతనమే. శంకరం, మీ డాక్టరు గారు అంత తక్కువ ఇస్తే సిగ్గు కాదా? పోనీలెండి మీ మాట కాదు, నా మాటా కాదు, అయిదు నూట పదహార్లు రాస్తున్నాను" వైకుంఠం రసీదు రాసి ఇచ్చాడు.

రాజేష్ గత్యంతరం లేక లోపలికి వెళ్లి వదిన నడిగి ఆ డబ్బు తెచ్చి ఇచ్చాడు.

○○○

వదినా! నువ్వు చెప్పినట్లు ఉద్యోగానికి అప్లై చేస్తాను" అన్నాడు డాక్టర్ రాజేష్ భోజనానికి కూర్చుంటూ.

"బాబాయ్ ముందు గదిని మేం వాడుకోవచ్చా?" అని అడిగాడు కొండలరావు పెద్దకొడుకు ఆనందంగా. ■